సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 10-3-2025

సంపుటి: 20 సంచిక: 294

పేజీలు: 8 వెల: రూ.1




## బంగారం వర్తకుల కార్యవర్గ ప్రమాణస్వీకారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం బంగారం వర్తకులు కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. అధ్యక్షునిగా లంక వెంకట అప్పలనాయుడు, కార్యదర్శిగా వూణ్ణ అనంత కృష్ణారావు, కోశాధికారిగా సురంపల్లి బ్రహ్మాజీ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా పేర్ల శ్రీకాంత్, చీఫ్ అడ్వైజర్‌గా పాండ్రంకి రమేష్ నాయుడు, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

భగవద్గీత మీదో, భగవంతుడి మీదో ప్రమాణం చేసి అంతా నిజమే చెబుతానని కోర్టులో చెప్పించడం ఒక నిబంధన. ఇందులో బోనెక్కినవారంతా ప్రమాణం చేసి చెప్పేది నిజమే అవుతుందన్న గ్యారెంటీ లేదు. అందుకే కోర్టుకు కావాల్సింది సాక్ష్యాలు, ఆధారాలు. ఈ మేరకే తీర్పులు వెలువడతాయి. రాజీ మార్గం రాజమార్గమన్నారు కదా అని లోక్ అదాలత్‌లో బాధితుల స్థానంలో వేరొకర్ని నిలబెట్టి రాజీ అయినట్టు చూపెట్టి కోట్ల ఆస్తులు కొట్టేయడానికి పన్నాగం రచించింది ఎవరైనా స్వయంగా కోర్టుతో గేమ్స్ ఆడటమే. అందుకు ఒకటికి మించిన గుండెలైనా ఉండాలి.. లేదా గుండెలు తీసిన బంటైనా అయివుండాలి. తనకు వ్యతిరేకంగా ఉన్నవారు దళితులు కాబట్టి ఏదో ఒక రూపంలో కోర్టులో కేసు పోతే తృణమో, ఫణమో ఇవ్వమని తన కాళ్ల ముందు మోకరిల్లుతారని భావించిన అహంకారం ఆమె కళ్లు కప్పేసింది. అందుకే కోర్టును సైతం తప్పుదోవ పట్టించింది.

సంఘసేవకురాలు పేరుతో ఎంతోమందికి సేవ చేస్తున్నానని చెప్పకుంటున్న ఆమె ఇప్పుడు అదే సంఘంలో దళితుల భూమిని అక్రమంగా దఖలుపర్చుకున్నారు. పేదల తలరాతలు మార్చడానికి ఆమె డాక్టరేట్ చేశారని భక్తబృందం ప్రకటిస్తే, ఆమె లేకుండా ఒక స్థాయి కార్యక్రమాలు ఈ జిల్లాలో జరగడం మానేసి చాలా ఏళ్లయింది. నీటిలో తేలియాడే విద్యలో ఆరితేరిపోయిన ఆమె ముంచడంలో స్పెషలిస్ట్ అని ఇప్పుడిప్పుడే తెలుస్తుంది. ఇన్నాళ్లూ 'అట కదా..' అన్న నోళ్లే అవి ఆరోపణలు కావు, వాస్తవాలని చెప్పడానికి ముందుకొస్తున్నాయి. కాకపోతే ఆ గొంతులు వినే వ్యవస్థ ఇక్కడ కరువైపోయింది. దళిత గిరిజన మహిళలను ఉద్ధరిస్తానంటూ ఎప్పటికప్పుడు ఫొటో కార్యక్రమాలు, పద్మశ్రీల కోసం పాకులాటలు జరిపే ఈమె ఇప్పుడు ఏకంగా కోట్లు విలువ చేసే స్థలానికి తన సామాజికవర్గం బలం చూసుకొని కబ్జాకు పాల్పడుతున్న కథనమే ఇది. వకాల్తా పుచ్చుకున్న న్యాయవాదిని, పోరాడతామని ముందుకు వచ్చిన ప్రజాసంఘాల నాయకుడ్ని, పక్కనే ఉన్న రెవెన్యూ యంత్రాంగాన్ని హోల్‌సేల్‌గా కొనేయడంతో న్యాయం కోసం తమ సొంత స్థలంలోనే గత కొన్నాళ్లుగా ఒక కుటుంబం వంటా-వార్పు చేసుకుంటోంది. కోర్టు నిబంధనలకు కొత్త సారం చెప్పిన ఈ కథనంలోకి వెళ్లాలంటే ముందు ఈ కథేమిటో తెలుసుకోవాలి.



# కోర్టును బురిడీ కొట్టించడమే 'గీతా'సారం



- 22ఎలో ఉన్న డి-పట్టాను కొన్నారట
- నకిలీ బాధితుల్ని కోర్టులో చూపెట్టి రాజీ చేశారు
- రూరల్ స్టేషన్ పక్కనే కోట్లు విలువైన ఆస్తికి ఎసరు
- హక్కుదారులు దళితులు కావడమే కారణం
- వీఆర్వో, లాయర్, ప్రజాసంఘ నాయకుడు కుమ్మక్కు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తండ్రి నుంచి వారసత్వంగా దఖలుపడాల్సిన ఆ ఆస్తి కోసం ఒక పేద దళిత కుటుంబం గత కొన్నాళ్లుగా రూరల్ పోలీస్‌స్టేషన్ గోడకు ఆనుకొని నిరసన చేపడుతోంది. ఈ విషయం అటు పోలీసులకు, ఇటు పత్రికలకు (ఆదిత్య మినహా) ఏమాత్రం పట్టలేదు. చివరకు అక్కడెక్కడో దళిత డీజీని సస్పెండ్ చేస్తే ఊరుకోమంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న దళిత సంఘాలు సైతం ఒక నిరుపేద కుటుంబానికి అండగా నిలవడానికి ముందుకు రాలేదు. తెల్లారి లేస్తే అంబేద్కర్ పేరు చెప్పుకొని పబ్బం గడుపుకొనే సంఘాలు కూడా పార్టీల ముసుగులో అక్రమార్కులకు వంతపాడటమే ఇక్కడ కొసమెరుపు.

జాతీయ రహదారికి ఆనుకొని శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌కు పక్కనే ఉన్న భూమి ధర బహిరంగ మార్కెట్‌లో రూ. కోట్లలో ఉంటుంది. దీన్ని స్వచ్ఛంద సేవకురాలుగా, సామాజిక కార్యకర్తగా చెప్పుకొని తిరుగుతున్న గీతాశ్రీకాంత్ ఆక్రమించి, దాని చుట్టూ ప్రహరీ కట్టి అక్కడకు ఎవర్నీ రానీయకుండా దౌర్జన్యం చేస్తున్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం-1973 అమల్లోకి వచ్చిన తర్వాత అప్పటి ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ భూమిని రాష్ట్ర

- మిగతా చివరి పేజీలో






## దక్షిణ భారతానికి పెనుద్రోహం...

# డీలిమిటేషన్



వనజ చే, ది వైర్ కోసం..

అధికారాన్ని అందిపుచ్చుకోడానికి ఎలాంటి అడ్డదారులైనా అవలీలగా తొక్కి అబద్ధాలతో తిమ్మిని బమ్మిని చేయగలిగే బీజేపీ చేతికి ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అనే అద్భుత అస్త్రం దొరికింది. బీజేపీకి అత్యంత లాభాన్ని చేకూర్చి మళ్లీ అధికారాన్ని కట్టబెట్టడంలో కీలక పాత్ర పోషించే ఈ డీలిమిటేషన్ అవకాశాన్ని బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోడానికి సిద్ధంగా ఉండదు. బీజేపీ ఉత్తరాధిలో మతవిద్వేషాలు రగిల్చి తిరుగులేని రాజకీయ లబ్ధి పొందినట్టు దక్షిణభారత దేశంలో నామమాత్రంగా కూడా చేయలేకపోతోంది. కమ్యునల్ రాజకీయాలతో దక్షిణ రాష్ట్రాల్లో పాగా వేసేందుకు దీర్ఘ కాలంగా ప్రయత్నిస్తూ విఫలమవుతోంది. బీజేపీ మత రాజకీయ పప్పులు ఇక్కడ ఉడకవని ఈ పాటికి ఆ పార్టీకి బాగానే అర్థమై ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలను వీలైనంతగా అణిచివేసి, నేరుగా ఆధిపత్యం చలాయించడానికి ఇప్పుడు బీజేపీ ముందున్న తిరుగులేని మార్గమే ఈ డీలిమిటేషన్ ప్రక్రియ.

ఒకవేళ బీజేపీ అనుకుంటున్న పద్ధతిలో డీలిమిటేషన్ జరిగితే సౌత్ ఇండియాకి జరిగే అన్యాయం, నష్టం మామూలు స్థాయిలో ఉండదు. పార్లమెంట్‌లో ఈ రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా పడిపోవడమే కాదు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియకు, దక్షిణ భారతదేశ పౌరుల ఓటుకు ఏమాత్రం విలువుండదు. ఈ రాష్ట్రాల నుంచి ఒక్క సీటు రాకపోయినా, ఒక్క ఓటు పడకపోయినా ఈ జాతీయ పార్టీలకు కేంద్రంలో అధికారం సునాయాసంగా దక్కుతుంది. దేశాన్నంతటినీ పాలించాల్సిన కేంద్ర ప్రభుత్వ ఎన్నికలో దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం అవసరమే ఉండదు. కేంద్రంలో ఒక పార్టీ అధికారంలోకి రావాలంటే దక్షిణాది పార్లమెంటరీ సీట్లు కూడా కీలకమైన ప్రస్తుత పరిస్థితుల్లోనే వారు సౌత్ స్టేట్స్‌ని ఘోరమైన వివక్షతో చిన్నచూపు చూస్తూ నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తుంటే.. ఇక ఈ రాష్ట్రాల సీట్లు, ఓట్లు ఢిల్లీ గద్దె మీద ఎలాంటి ప్రభావం చూపించలేని స్థితికి ఈ రాష్ట్రాలు దిగజారిపోతే, ఓపక్క మనల్ని దోచుకుంటూ ఇప్పుడు విదిల్చే ఈ నాలుగు మెతుకులు కూడా అప్పుడు విదల్చకుండా పూర్తి మొండిచేయి చూపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. హక్కుగా తమకు రావలసిన వాటాని పొందే మాట అటుంచి అడిగే హక్కుని కూడా ఈ రాష్ట్రాలు కోల్పోతాయి. ఉత్తరాది దురహంకారాన్ని, దుర్మార్గమైన ఈ డీలిమిటేషన్ చర్యని దక్షిణ భారతీయులందరూ ఏకతాటిపై తీవ్రంగా ప్రతిఘటించకపోతే దక్షిణాది ప్రజల మనుగడే ప్రశ్నార్థంగా మారే ప్రమాదముంది.

### డీలిమిటేషన్ అంటే..

దేశంలో వివిధ రాష్ట్రాల్లో పెరిగిన జనాభాకి అనుగుణంగా పార్లమెంట్‌లో ఆయా రాష్ట్రాలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల సంఖ్య పెంచడమో లేక తగ్గించడమో చేసే ప్రక్రియ. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా 1951లో జరిగిన జనాభా లెక్కల ఆధారంగా అప్పటి దేశజనాభా 36.1 కోట్లకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంట్ నియోజకవర్గాలను 494 సీట్లగా విభజించారు. 1961లో దేశ జనాభా 43.9 కోట్లకు పెరిగితే, పార్లమెంట్ సీట్లను 522కు పెంచారు. తిరిగి 1971 లెక్కల ప్రకారం దేశ జనాభా 54.8 కోట్లకు పెరగడంతో అప్పుడు జరిగిన డీలిమిటేషన్‌లో నియోజకవర్గాల సంఖ్య 543కి చేరుకుంది. అప్పటికే జనాభా పెరుగుదల నిష్పత్తిలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య గణనీయమైన వ్యత్యాసాన్ని గుర్తించిన ఇందిరాగాంధీ నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, జనాభా నియంత్రణ ఆవశక్యతను పరిగణలోకి తీసుకుని అన్ని రాష్ట్రాలు జనాభా నియంత్రణా విధానాలు కచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టాలని, అన్ని రాష్ట్రాల్లో జనాభా నియంత్రణా నిష్పత్తి దాదాపు సమానంగా ఉన్నప్పుడు మాత్రమే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని, లేనిపక్షంలో జనాభాని నియంత్రించి దేశాభివృద్ధికి తోడ్పడే రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని భావించింది. కాబట్టి ఉత్తరాది రాష్ట్రాలు కూడా దక్షిణ రాష్ట్రాలతో సమానంగా జనాభాని కంట్రోల్ చేసేందుకు మరో 25 సంవత్సరాలు గడువు (2001 వరకు) విధిస్తూ అప్పటి వరకూ డీలిమిటేషన్ ప్రక్రియను హోల్డ్ చేస్తూ 1976లో 42 అమెండ్‌మెంట్ తీసుకొచ్చారు.

### అక్షరాస్యతలో వెనక.. జనాభాలో ముందు

దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర ప్రతిపాదనను బాధ్యతగా అమలుచేసి జనాభా నియంత్రణ, అక్షరాస్యత పెంపు, ఆరోగ్యాభివృద్ధి వంటి అనేక అంశాలను సమర్థవంతంగా సాధించగలిగాయి. మరోపక్క ఉత్తరాది రాష్ట్రాలు ముఖ్యంగా హిందీ బెల్ట్ అని చెప్పుకునే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు అక్షరాస్యత, అభివృద్ధిలో వెనుకబడడమే కాకుండా విచక్షణారహితంగా జనాభాను గణనీయంగా పెంచాయి. 2001 నాటి జనాభా లెక్కల ప్రకారం ఉత్తర దక్షిణ రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు వ్యత్యాసం తగ్గకపోగా మరింత పెరగడంతో జనాభా ఆధారంగా జరిగే

- మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

# ట్రంప్ తగ్గినా ఆశ్చర్యం లేదు

పీఠమెక్కి రెండు నెలలు కూడా గడవక ముందే కొరడా రాజుగా మారిన డోనాల్డ్ ట్రంప్ తనకు లొంగరు అనుకున్నవారి మీద ఎడాపెడా కొరడా ఝుళిపిస్తున్నాడు. సుంకాలు, ప్రతి సుంకాలు, ఆంక్షలు విధిస్తూ బస్తీమే సవాల్ అంటున్నాడు. తలవంచేట్లు చేసేందుకు బెదిరింపులా, బేరమాడేందుకు వేస్తున్న పాచికలా చివరకు ఏం జరుగుతుంది, ఎలా ముగుస్తుందన్నది ఎవరూ చెప్పలేరు. ప్రతి దేశానికి బలం–బలహీనతలున్నాయి, దానికి అమెరికా మినహాయింపు కాదు గనుక ట్రంపు కూడా తగ్గినా ఆశ్చర్యం లేదు. ప్రతి దేశమూ సర్వసత్తాకమే, ప్రతివారూ తమదైన పద్ధతిలో ఆర్థిక వ్యవస్థలను నడిపిస్తున్నారు. తమ దేశాన్ని మరోసారి అగ్రస్థానంలో నిలుపునంటూ ట్రంప్ ప్రపంచం మీద వీరంగం వేస్తే కుదరదు. రవి అస్తమించని సామ్రాజ్యాధిపతులం అనుకున్న బ్రిటన్ ఏమైంది, ప్రపంచాన్ని చాపలా చుట్టి చంకలో పెట్టుకోవాలనుకున్న హిట్లర్‌కు ఏగతి పట్టిందీ ఎరుకే. ఒక పోరులో గెలుస్తామా లేదా అన్నది తర్వాత అంశం, ఎదుటివారు దురాక్రమణకు పాల్పడితే ప్రతిఘటించాలా, చేతులు నలుపుకోవాలా అన్నదే సమస్య. వివాదాలు తలెత్తితే ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఓ), ఐరాస, ప్రపంచ కోర్టులు ఉన్నాయి. ఎలాంటి సంప్రదింపులు, అభిప్రాయాల మార్పిడి లేకుండానే తన బుర్రలో తెల్లవారుజామున పుట్టిన బుద్దిని బయటపెట్టుకున్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు ప్రకటించి చర్చలకు సిద్ధమంటున్నాడు. ఆత్మగౌరవం గల ఏ దేశమూ ఈ దందాను అంగీకరించదు. అందుకే 'మా ఇల్లు మీకెంత దూరమో.. మీ ఇల్లూ మాకూ అంతేదూరం' అంటూ వెంటనే స్పందించాల్సిందే. రా! ఎలాంటి యుద్ధం కావాలని కోరుకుంటావో దానికి మేమూ సిద్ధమంటూ తాజాగా చైనా భేరీ మోగించింది. గతంలో ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం, ఇతర మరికొన్ని సమస్యల కారణంగా అక్కడ గతంలో మాదిరి వృద్ధిరేటు లేని మాట నిజం కావచ్చుగాని అది ఏ ఇతర ధనిక దేశంతో పోల్చుకున్నా ఎంతో మెరుగైనదే. అది ఎదుర్కొంటున్న సమస్యలను అవకాశంగా తీసుకొని అణగదొక్కుదామని చూస్తే కుదిరేది కాదని తేలిపోయింది. ట్రంపూ అతగాడితో ఊరేగుతున్నవారు, ఉబలాటపడుతున్న వారికీ అర్థమౌతోందా అంటే లేదనే చెప్పాలి. ఒకవేళ అవగతమైతే పరిణామాలు వేరుగా ఉండేవి. బీజింగ్‌లో జరుగుతున్న పీపుల్స్ కాంగ్రెస్ ఐదు శాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్ణయించి దానికి అవసరమైన చర్యల గురించి చర్చిస్తున్నది. దశాబ్దాల తరబడి అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న కెనడాను ఆక్రమించి 51వ రాష్ట్రంగా చేసుకోవాలన్న సంకల్పాన్ని ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నాడు. మరోసారి దాన్ని అవమానకరంగా వెల్లడించాడు. ప్రతి సుంకాలు విధిస్తే మరింతగా పెంచుతామంటూ పెట్టిన సామాజిక మాధ్యమ పోస్టులో కెనడా ప్రధానిని ఉద్దేశించి ఈ విషయాన్ని 'కెనడా గవర్నర్ జస్టిన్ ట్రుడేవ్‌కు' వివరించండని కూడా దానిలో సలహా ఇచ్చాడు. అంటే కెనడా తమ రాష్ట్రమని పునరుద్ఘాటించటమే. టిప్‌టాప్‌గా ఉన్నప్పటికీ అతగాడి చర్యలు పిచ్చివాడి పనిగా ఉందంటూ ఒక పత్రిక చేసిన వ్యాఖ్యను ట్రంప్ గురించి ట్రుడేవ్ ఉటంకించాడు, తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా ప్రతిసుంకాలను ప్రకటించాడు. అత్యంత సన్నిహితం, భాగస్వామిగా ఉన్న కెనడా మీద వాణిజ్య యుద్ధం ప్రకటించి అదే సమయంలో హంతక నియంత పుతిన్‌ను సంతుష్టీకరించేందుకు పూనుకోవటం మతి ఉండి చేస్తున్న పనులేనా అన్నట్లుగా విరుచుకుపడ్డాడు. అఫ్ కోర్సు ఇదే పెద్ద మనిషి తర్వాత జావగారిపోయినా చేసేదేమీ లేదు, అది వేరే విషయం. చివరికి కెనడాలో అత్యధిక జనాభా గల ఒంటారియో రాష్ట్ర ప్రధాని డగ్ ఫోర్డ్ కూడా ట్రంప్‌ను దుయ్యబట్టాడు. 'మేమిచ్చే విద్యుత్, ఇంధనం మీద ఆధారపడుతూ మమ్మల్ని బాధిస్తారా, మేం తలుచుకుంటే న్యూయార్క్ నగరంలో 15 లక్షల మందికి విద్యుత్ నిలిచిపోతుంది జాగ్రత్త' అన్నాడు. ఇక్కడ సమస్య ఏమిటంటే ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్న కెనడియన్లే అలా స్పందిస్తే మన సంగతేమిటి? ఉన్న కార్యక్రమాలన్నీ ఆకస్మికంగా రద్దు చేసుకొని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లి అక్కడి వాణిజ్యమంత్రితో సంప్రదింపులు జరిపినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా మరుక్షణమే ట్రంప్ ప్రకటన చేశాడు. తాను ప్రపంచమంతా తిరిగిపోయిన భారత ప్రతిష్టను తిరిగి తెచ్చానని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ నోటి నుంచి ట్రంప్ సుంకాల ప్రకటన మీద గడిచినా ఎలాంటి స్పందన లేదు. ఆత్మగౌరవమా, లొంగుబాటా? ఏమనుకోవాలి? ఫిబ్రవరి రెండవ వారంలో మోదీ అమెరికా పర్యటన జరపటానికి ముందే నమస్కార బాణం వేసినట్లుగా కొన్నింటి మీద పన్నులు తగ్గించి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకొనేందుకు చూశారు. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదనుకోవాలా? 140 కోట్ల మంది జనానికి ఏదో ఒకటి చెప్పాలా వద్దా!



# మానవ సంబంధాలన్నీ.. ఆర్థికమేనా?

ఒకప్పుడు సమాజంలో ఎవరికైనా ఆపదవస్తే ఒకరికి ఒకరు తోడుగా ఉండేవారు. నేడు పరిస్థితులు మారిపోయాయి. మనకెందుకులే అనుకునే సంస్కృతి సమాజంలో పెరిగిపో యింది. వ్యక్తి ఎంత సేపు ఆర్థిక సంబంధాలు కోసం మాత్రమే మానవ సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.ప్రతిరోజు ఒకరితో మనం కలిసి ఉంటే మనకు వారు ఏ విధంగా ఉపయోగపడ తారు అనే ఆలోచన సమాజంలో పెరిగిపోయింది. చివరికి కుటుంబ సభ్యుల అనుబంధాలు కూడా ఆర్థిక సంబంధాలుగా మారిపోవడం చాలా దురదృష్టం. ఈ పరిణామం మానవ సంబంధాలపై చాలా ప్రభావం చూపుతుంది. బంధువుల్లో ఒకరు చనిపోతే వారి చుట్టాలు సోషల్ మీడియాలో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రత్యక్షంగా వారి ఇంటికి వెళ్ళి ఓదార్చిన సందర్భం లేదు కనీసం ఫోన్‌లోనైనా పలకరించ లేదు. అన్నదమ్ముల్లో ఒకరి పుట్టినరోజు ఇంకొకరు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. దగ్గరి స్నేహితుల్లో ఒకరి ఇంట్లో పెండ్లి ఉంది పెండ్లి కార్డు వాట్సప్ గ్రూప్‌లో పెట్టారు. రోజు కలిసే వారే కాని భౌతికంగా ఆహ్వానించలే. ఒకే కాలనీలో ఉండే వారిలో ఒకరికి ఆపద వచ్చింది వెంటనే సోషల్ మీడియాలో పెట్టారు. కాని సహాయం చేయడంలో వెనుకంజ, ఇదేమిటంటే సోషల్ మీడియాలో పెడితే ఎవరో ఒకరు సహాయం చేస్తారు అంటారు. వారు మాత్రం చేయరట. మానవ సంబంధాలు, ఆప్యాయతలు, అనుబంధాలు ఇలా ఎందుకు మారాయి? ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు పలకరింతలు మాని వాట్సాప్ సందేశాలు పంపుకోడం దేనికి సంకేతం? వీళ్ళందరితో మాట్లాడితే సోషల్ మీడియాలో పెట్టాం కదా అంతకన్నా ఏం చేస్తాం మరి అనడం ద్వారా మానవ సంబంధాలకి వారు ఇస్తున్న విలువేంటి? ఉమ్మడి కుటుంబాల్లో కుటుంబ సభ్యులందరూ కలిసి ఉండేవారు. ఆ కుటుంబంలో ఉండే పెద్దవారు కుటుంబ సభ్యులకు తెలియకుండానే వ్యక్తిత్వ వికాస బోధన చేసేవారు. వారి ప్రవర్తన చూసి పిల్లలు నేర్చుకునేవారు. భవిష్యత్తులో సమాజంలో ఏ విధంగా ఉంటే మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారో వారికి దిశనిర్దేశం చేసేవారు. నేటి ఆధునిక యుగంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. న్యూక్లియర్ ఫ్యామిలీస్ ఏర్పడ్డాయి. ఈ కేంద్రక కుటుంబాలలో వ్యక్తిగత స్వార్థాలు పెరిగాయి. సమాజంలోని మిగతా కుటుంబాలతో సంబంధాలు, అనుబంధాలు తగ్గిపోయాయి. గతంలో కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు కలిసినప్పుడు మనస్ఫూర్తిగా వారి అనుభవాలను పంచుకుంటూ భవిష్యత్‌కి బాటలు వేసుకుంటూ ఆనందంగా, సంతోషంగా గడిపేవారు. నేడు పూర్తిగా పరిస్థితులు మారిపోయాయి. అందరూ కలిసినప్పుడు భౌతికంగా మాట్లాడుకోకుండా స్మార్ట్ ఫోన్లను వినియోగిస్తూ విలువైన కాలాన్ని సోషల్ మీడియాలో దుర్వినియోగం చేస్తూ అనుబంధాలకు, ఆప్యాయతలకు దూరమవుతున్నారు. ఆధునిక ప్రపంచంలో మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారడానికి ప్రధాన కారణాలు తను మాత్రమే ఎదగాలని వ్యక్తిగత స్వార్థం, సామాజిక స్పృహ లోపించడం, సోషల్ మీడియా, ఉమ్మడి కుటుంబాలకు దూరంగా ఉండడం మొదలగునవి. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే సంభాషణల వల్ల వారిద్దరి మధ్య మానవ సంబంధాలు బలపడే అవకాశాలున్నాయి. సోషల్ మీడియా ప్రభావానికిలోనై ప్రజలు భౌతికంగా సంభాషించడం మానేసి చాలా రోజులైంది. వారి హావభావాలకు వేదికగా సోషల్ మీడియాను బాగా వాడుకుంటున్నారు. వారి సంతోషం, బాధలు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇంస్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్, షేర్ చాట్ వంటి సోషల్ మీడియా సాధనాలలో ఎక్కువ సమయం గడుపుతూ భౌతికంగా వ్యక్తుల మధ్య ఉండే సంభాషణలు, ప్రేమ, అనురాగాలు, ఆప్యాయతలకు, అనుబంధాలకి దూరమవుతున్నారు. సామాజిక మాధ్యమాలలో ఉండే స్నేహితులే వారికి నిజమైన స్నేహితులుగా భావిస్తున్నారు. తద్వారా భౌతికంగా విద్యార్థి దశలో, ఉద్యోగంలోనూ సామాజిక జీవనంలో కూడా స్నేహితులకు దూరమవుతున్నారు. సామాజిక మాధ్యమంలో పోస్టులు పెడుతూ వాటిలో వచ్చే లైకులు, కామెంట్లను చూసి సంబరపడిపోతున్నారు. అవి రాకపోతే బాధపడుతున్నారు. మానసికంగా కుంగిపోతున్నారు. ప్రత్యక్ష అనుభూతులకు దూరమవుతున్నారు.సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల్లో నిజాలు గోరంతయితే దాన్ని కొండంతగా చూపించే పద్ధతికి అలవాటుపడుతున్నారు. ఊహా లోకంలో విహరిస్తున్నారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు సోషల్ మీడియాలో చూపెడుతున్నారు. ఇది వ్యక్తి సమగ్ర అభివృద్ధికి, వికాసానికి గొడ్డలి పెట్టులాంటిది. స్టేట్ ఆఫ్ మొబైల్ –2023 ప్రకారం భారతీయులు ప్రతిరోజు సగటున ఐదు గంటల పాటు స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. అత్యధికంగా స్మార్ట్ ఫోన్లను ఉపయోగిస్తున్న వారిలో ప్రపంచంలోనే ఎనిమిదవ స్థానంలో భారతీయులున్నారు. విలువైన కాలాన్ని సోషల్ మీడియాలో వృథా చేస్తూ గడిపేస్తున్నారు. భారతీయ జనాభాలో యాక్టివ్ సోషల్ మీడియా ఉపయోగిస్తున్న ప్రజలు 33.4%. వీరు దాదాపుగా 2.6 గంటలు ప్రతీ రోజు సోషల్ మీడియాలో గడుతున్నారు. ఇది గమనించిన రాజకీయ పార్టీలు రాబోయే ఎన్నికల్లో సోషల్ మీడియా వేదిక ద్వారానే అత్యధిక ప్రచారం చేయనున్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సోషల్ మీడియానే అధికంగా వాడాయి. ఎన్నికల టైంలో ప్రజలు ఇంకా ఎక్కువ కాలం సోషల్ మీడియాలో గడిపే అవకాశం ఉంది. ప్రజల అవసరాలను గమనించిన సోషల్ మీడియా కంపెనీల యజమానులు వారి కాసుల పంట పండించుకుంటున్నారు. కోట్లకు పడగెత్తుతున్నారు. ప్రజలు ఎక్కువ సమయం సోషల్ మీడియాలో గడపడానికి ప్రత్యేకంగా యాప్లు రూపొందిస్తూ వారిని ఆకర్షిస్తున్నారు. దీనికి సైకాలజిస్ట్ల, మార్కెటింగ్ మేనేజర్ల సలహా సూచనలు తీసుకుంటున్నారు. కార్పొరేట్ కంపెనీలు సోషల్ మీడియా యజమానులు వారి ఎజెండాలను ప్రజలపై తెలియకుండానే రుద్దుతున్నారు. తద్వారా ప్రజలు రాజకీయ పార్టీల ప్రచారాలను నమ్మి మోసపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అదే సమయంలో సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బ తింటున్నాయి. బాల్యంలోనే విద్యార్థులకు నైతిక విలువలు, మానవ సంబంధాలు, ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైన, వీటిని విద్యా విధానంలో చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యార్థులను, యువకులను ధనార్జక యంత్రాలుగా కాక మానవీయత కలిగిన వారుగా, మంచిపౌరులుగా రూపొందించాల్సిన బాధ్యత సమాజం పైన ఉంది. చిన్నతనం నుంచి విద్యార్థులు సామాజిక స్పృహను, ఎదుటి వారికి సహాయపడే గుణాన్ని అలవాటు చేస్తే వారు పెద్దయ్యాక సమాజ సేవకులుగా ఎదిగే అవకాశం ఉంటుంది. మానవ సంబంధాలు ఆర్థిక అవసర సంబంధాలుగా కాక ప్రేమ, అనురాగ ఆప్యాయత అనుబంధాలుగా మారే అవకాశం ఉంటుంది.

- ఉయ్యాల సురేందర్



# సూపర్ క్యూట్ .. జాన్వీకపూర్‌ని చూశారా!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా కాలం అయింది. ఈమె అక్కడ పెద్దగా సక్సెస్‌ను దక్కించుకోలేక పోయింది. అయినా సోషల్ మీడియాలో ఉన్న పాపులారిటీ కారణంగా ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు దక్కిన గుర్తింపు కారణంగా బాలీవుడ్‌లో ఫ్లాప్‌లు పడ్డా వరుసగా ఆఫర్లు అయితే వచ్చాయి. తాజాగా తెలుగులో ఎన్టీఆర్‌కి జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో మొదటి కమర్షియల్ బ్రేక్‌ను దక్కించుకుంది. తెలుగులో ఈ అమ్మడు ప్రస్తుతం రామ్ చరణ్‌కి జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే.

ఎన్టీఆర్‌తో దేవర సినిమాలో నటించి నటిగా ఆశించిన స్థాయిలో అలరించలేక పోయిన జాన్వీ కపూర్‌కి ప్రస్తుతం నటిస్తున్న రామ్ చరణ్ మూవీతో కచ్చితంగా మంచి మార్కులు వస్తాయని అంతా భావిస్తున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ పల్లెటూరు అమ్మాయిగా కనిపించబోతుంది. బుచ్చిబాబు మొదటి సినిమా ఉప్పెనలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. కనుక ఈ సినిమాలోనూ జాన్వీ కపూర్ పాత్రకు మంచి ప్రాముఖ్యత ఉండటం ద్వారా టాలీవుడ్‌లో ఈ అమ్మడు మరింతగా ప్రేక్షకులకు చేరువ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ప్రతిసారి జాన్వీకపూర్ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఏ ఔట్‌ఫిట్‌లో అయినా జాన్వీ కపూర్ చాలా అందంగా ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. అలాంటి ఫోటోలను షేర్ చేసే జాన్వీ కపూర్ తాజాగా మరో సారి తన క్యూట్ ఫోటోలను షేర్ చేసింది. ఒక డ్రింక్‌ను తాగుతూ క్యూట్‌గా నవ్వుతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన జాన్వీ కపూర్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంత క్యూట్‌గా ఉండటం జాన్వీ కపూర్ కే సాధ్యం అంటూ కొందరు నెటిజన్స్ సోషల్ మీడియా ద్వారా కామెంట్ చేస్తున్నారు.

టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తున్న జాన్వీ కపూర్ మరో వైపు బాలీవుడ్‌లోనూ అదే జోరును కొనసాగిస్తోంది. తెలుగులో ఈ అమ్మడు చేస్తున్న సినిమా ప్రస్తుతం ఒకేటే అనే విషయం తెల్సిందే. రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబో మూవీ కాకుండా జాన్వీ కపూర్ మరో అవకాశంను తన ఖాతాలో వేసుకుందనే వార్తలు వస్తున్నాయి. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ ఒక హీరోయిన్‌గా ఎంపిక అయిందట. సినీ వర్గాల ద్వారా అందుతున్న ప్రచారం ప్రకారం అల్లు అర్జున్‌తో అట్లీ రూపొందిస్తున్న సినిమాలు నలుగురు లేదా ఐదుగురు హీరోయిన్స్ నటించనున్నారట. అందులో మెయిన్ హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేశారని టాక్ వినిపిస్తుంది. పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# ఎన్టీఆర్ కోసం కొత్త టైటిల్!!

ఎన్టీఆర్ చేతిలో రెండు సినిమాలున్నాయిప్పుడు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం ఇటీవలే సెట్స్ పైకి వెళ్లింది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు దాదాపుగా ఫిక్సయిపోయినట్టే. హృతిక్ రోషన్ తో వార్ 2 చేస్తున్నాడు. మరో వైపు ఎన్టీఆర్ కోసం కొత్త కథలు రెడీ అవుతున్నాయి. 'డాక్టర్', 'జైలర్' చిత్రాల దర్శకుడు నెల్సన్ ఎన్టీఆర్ కోసం ఓ స్క్రిప్టు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. 'జైలర్ 2' పనుల్లో బిజీగా ఉన్న నెల్సన్.. ఆ సినిమా పూర్తయిన వెంటనే ఎన్టీఆర్ సినిమాని పట్టాలెక్కించడానికి రెడీ అవుతున్నారు. ఈ చిత్రం కోసం 'రాక్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. ఏ టైటిల్ పెట్టినా పాన్ ఇండియా ప్రేక్షకుల్ని దృష్టిలో ఉంచుకోని పెట్టాల్సిందే. 'రాక్' అయితే అందరికీ అర్థం అవుతుందన్న ఉద్దేశంతో నెల్సన్ ఈ టైటిల్ వైపు మొగ్గు చూపిస్తున్నాడని సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. నాగవంశీ నిర్మాత. 2026లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల్సన్ యాక్షన్ సినిమాల్ని బాగా తీర్చిదిద్దగలడు. కామెడీ సెన్స్ కూడా ఉంది. ఇవి రెండూ మిక్స్ చేసి 'రాక్' కథని అల్లుకొన్నాడని సమాచారం. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# ఫేమస్ అవ్వడం కోసం ఇంతకు తెగించాలా?

ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన చిన్న సినిమాలు సంచలనమైతే అందులో నటీనటులు ఓవవర్ నైట్ లో ఫేమస్ అయిపోతారు. అలాంటి చిన్న సినిమాల్లో ఇటీవల రిలీజ్ అయిన ప్రదీప్ రంగనాద్ నటించి "డ్రాగన్" ఒకటి. తెలుగు, తమిళ్ లో ఈ సినిమా మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రదీప్ సంగతి పక్కన బెడితే ఇందులో సెకెండ్ హీరోయిన్ గా నటించిన కయాదు లోహర్ బాగా ఫేమస్ అయింది. అమ్మడు స్కిన్ షోతో కుర్రాళ్లలో కాకలు పుట్టించింది. సొగసరి అందానికి యువత ఫిదా అవుతుంది. సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోనూ నిలిచింది. అప్పడే తెలుగు సినిమాలు కూడా సైన్ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఓ సినిమాలో ఎంపికైందని సమాచారం. అయితే ఈ భామ కోలీవుడ్ లో ఇద్దరు స్టార్ హీరోల అభిమానుల మధ్య పెద్ద చిచ్చే రేపింది. ఇటీవల ఓ కాలెజ్ ఈవెంట్లో అభిమానులు మీకు ఇష్టమైన హీరో ఎవరని అడిగితే తలపతి విజయ్ పేరు చెప్పింది. సర్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. అందులోనూ విజయ్ నటించిన "తేరి" సినిమా ఎన్నిసార్లు చూసానో? తనకే తెలియదంది. అయితే ఇదే బ్యూటీ గతంలో తన అభిమాన హీరోగా ధనుష్ పేరు చెప్పింది. అతడి హిట్ సినిమాల గురించి తెగ పొగిడేసింది. ఇలా ఇద్దరుహీరోల పేర్లు చెప్పడంతో? ఆ హీరోల అభిమానుల మధ్య చిచ్చు రేగింది. ఇద్దరు హీరోల అభిమానులు కయాదు ను లైక్ చేసిన వారు కావడంతో ఈ కుంపంటి మొదలైంది. కయాదుకు మా హీరో మాత్రమే క్రష్ అంటూ ఇరువురు హీరోల అభిమానులు సోషల్ మీడియాలో యుద్దానికి తెర తీసారు. అయితే కయాదు ఇలా చెప్పడానికి కారణం ఇద్దరు హీరోల అభిమానుల మధ్య మరింఒత ఫేమస్ అవ్వం కోసమే ఈ డ్రామాకి తెర తీసిందంటూ మరికొంత మంది అభిమానులు మండి పడుతున్నారు. దీనికి తెర పడాలంటే కయాదు హీరోలిద్దరు సమానమే అంటే తప్ప పంచాయతీ తెగదు.


- తుపాకి.కామ్ సౌజన్యంతో...





గాంధీ పుట్టిన గుజరాత్ గడ్డలో గాంధీల కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి ముప్పయ్యేళ్లయ్యిందా? ఒక తరం దాటిందా? మరో ముప్పయ్యేళ్లపాటు వరుసగా గెలుస్తూనే ఉండడానికి వీలుగా మోడీ బీజెపి పునాదులు వేసుకుందా? అన్నది కేవలం అకెడెమిక్ ప్రశ్న. బయటనుండి చూసేవారికే ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీని మళ్ళీ సింహాసనం మీద కూర్చోబెట్టాలనుకుని కాలికి బలపం కట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి ఎలా ఉండాలి చెప్పండి! గుజరాత్ లో కాంగ్రెస్ పార్టీకి కాయకల్ప చికిత్స చేద్దామని రాహుల్ కు ఉన్నట్లుంది. కానీ ఎక్కడినుండి మొదలుపెట్టాలో మొదట్లో క్లారిటీ ఉన్నట్లు లేదు. ఇప్పుడు క్లారిటీ వచ్చినట్లుంది.

# ఇంటిదొంగను.. ఈశ్వరుడైనా పట్టుకోగలడా?



## కాంగ్రెస్‌లో స్లీపర్ సెల్స్

Courtesy: Namaste Telangana

- పార్టీలో ఉంటూ బీజేపీకి పనిచేస్తున్నారు
- అలాంటి వారందరినీ ఫిల్టర్ చేయాలి
- అవసరమైతే 30-40 మందికి ఉద్వాసన
- రాహుల్ గాంధీ హెచ్చరిక
- సొంత పార్టీపైనే ట్రోలింగ్ చేస్తున్నారని బీజేపీ ఎద్దేవా
- ఆయనే తమ అతిపెద్ద ఆస్తి అని వ్యాఖ్య

న్యూఢిల్లీ, మార్చి 8: కాంగ్రెస్‌లో ఉంటూ కొందరు బీజేపీ కోసం పనిచేస్తున్నారని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీని ప్రక్షాళన చేసే క్రమంలో అవసరమైతే స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్న 30-40 మందిని పార్టీ నుంచి తొలగించడానికి సిద్ధమేనని అన్నారు. రాహుల్ హెచ్చరికలను బీజేపీ ఎద్దేవా చేసింది. పార్టీకి పెద్ద ఆస్తి లాంటి సొంత పార్టీ నేతలనే ఆయన తప్పుబట్టారని, వాస్తవానికి 'బీజేపీకి రాహులే అతిపెద్ద ఆస్తి' అని పేర్కొంది. పార్టీలో రెండు రకాల నాయకులు ఉన్నారని, వారిలో కొందరు నిత్యం ప్రజలతో నిజాయితీగా మమేకం అయి ఉంటుండగా, మరికొందరు ప్రజలకు దూరంగా ఉంటున్నారని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజలకు దగ్గర అవ్వాలంటే ఆ రెండు గ్రూపులను విడదీయాల్సి ఉందని, ప్రజల కోసం పనిచేయని వారిని సాగనంపాల్సి ఉందని ఆయన చెప్పారు. 'ఎవరైతే కాంగ్రెస్‌లో ఉంటూ రహస్యంగా బీజేపీకి పనిచేస్తున్నారో వారంతా బయటకు రావాలి' అని రాహుల్ పేర్కొన్నారు. 30 ఏండ్లుగా గుజరాత్‌లో అధికారంలో లేని కాంగ్రెస్ పలు సవాళ్లను ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కేవలం ఎన్నికల మీద మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తే ప్రజల విశ్వాసాన్ని పొందలేమని అన్నారు. మన బాధ్యతలు నెరవేర్చే వరకు గుజరాత్ ప్రజలు మనల్ని ఎన్ను కోరని, మొదట మనం ప్రజల నమ్మకాన్ని చూరగొనాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ప్రస్తావిస్తూ రాహుల్ బీజేపీకి పెద్ద ఆస్తి అని వ్యాఖ్యానించారు.

రెండ్రోజులపాటు గుజరాత్ లో కాంగ్రెస్ పార్టీని సమీక్షిస్తూ ఆయన ఒక ఆసక్తికరమైన మాట అన్నారు. ఇక్కడ నాముందు కూర్చున్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల్లో రెండు రకాల వాళ్ళున్నారు.

1. నిత్యం జనంలో ఉంటూ, జనం సమస్యలమీద పోరాడుతూ కాంగ్రెస్ జెండాను మోసే నిజమైన కార్యకర్తలు.

2. జనంతో సంబంధం లేకుండా కాంగ్రెస్ లో ఉంటూ బి జె పి కి కోవర్టులుగా పనిచేసేవారు.రెండో రకం వారిని నిర్దయగా ఏరిపారేయండి అన్నారు. అలా అనగానే సభ కరతాళ ధ్వనులతో మారుమోగిపోయింది. కార్యకర్తల మొహంలా ఏదో తెలియని కాంతి తళతళలాడింది. అంటే రెండో రకం వారున్నారని, వారిని ఏరిపారేయడం అవసరమని సభ హర్షధ్వానాలతో ఆమోదించినట్లుగానే భావించాలి.

అదే బీ జె పి లో ఉంటూ ఇలాగే కాంగ్రెస్ కు పనిచేసే కోవర్టులు ఉంటే చిటికెలో ఏరిపారేయరా? బి జె పి కి పనిచేసే కాంగ్రెస్ గుజరాత్ కోవర్టులెవరో రాహుల్ కు తెలుసు. కానీ తీసిపారేయలేకపోయారు. అదే కాంగ్రెస్ బలహీనత. అదే ఒక్కోసారి దాని బలం కూడా. అంతర్గత, బహిర్గత, అంతర్బహిర్గత ప్రజాస్వామ్యం కాంగ్రెస్ లో ఉండాల్సిందానికంటే ఎప్పుడూ కొన్ని మెట్రిక్ టన్నులు ఎక్కువే ఉంటూ ఉంటూ ఉంటుంది. తాజాగా తెలంగాణలో కాంగ్రెస్ లో రెడ్ల ఆధిపత్యంలో బీసీలు నలిగిపోతున్నారంటూ పేరున్న కాంగ్రెస్ లీడర్లే బహిరంగంగా విమర్శించారు. చెడు చెవిలో చెప్పండి- మంచి పబ్లిగ్గా చెప్పండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పబ్లిక్ మీటింగుల్లో చెబుతున్నప్పుడే కాంగ్రెస్ అగ్రనాయకులు చెడును పబ్లిగ్గా మైకులో చెప్పి మంచిని అక్కడే ఆయన చెవిలో బాధ్యతగా చెబుతూ ఉంటారు. ఆ స్వేచ్ఛను పార్టీ ఇస్తుందో! లేక నాయకులే తీసుకుంటారో! తెలియదు కానీ ఆ నిర్నిరోధమైన స్వేచ్ఛ ఎంత ఉంటుందంటే కోవర్టులున్నారని పార్టీ అధినాయకుడే పబ్లిగ్గా గుండెలు బాదుకోవాల్సినంత.

పనిలో పనిగా గుజరాత్ తో పాటు మిగతా రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్‌లో ఉంటూ కాంగ్రెస్ చెడు కోరిబీ ప్రత్యర్థి బాగు కోరి శక్తి వంచన లేకుండా పనిచేసిన, చేస్తున్న, చేసే అవకాశమున్న కోవర్టుల గుర్తింపుకుబీ ఏరివేతకు "కాంగ్రెస్ చోడో" కార్యక్రమం ఒకటి ఆసేతుహిమాచలం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అన్నట్లు-**

గుజరాత్ నేల మీద మోడీని మృత్యు బేహారి అనిబీ

మహాకుంభ మేళా ప్రయాగ్ రాజ్ గంగలో మునిగితే పాపాలు పోతాయా? అని రాజకీయంగా వేసుకున్న అధినేతల అతిపెద్ద సెల్ఫ్ గోల్స్ ముందు ఈ కోవర్టులు చేయగలిగిన డ్యామేజ్ శత సహస్రాంశం కూడా కాకపోవచ్చు!

ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడని సామెత. గుజరాత్ సౌరాష్ట్ర తీరంలో సోమనాథేశ్వరుడేమైనా పట్టుకోగలడేమో!

హిందువులు కాంగ్రెస్ ను ఎందుకు దూరం పెట్టారో కాంగ్రెస్ కు తెలుసు. కానీ ఏమీ చేయలేదు. వీలైనంత ఇంకా ఎక్కువ దూరం చేసుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తూ ఉంటుంది. దేశ యువత కాంగ్రెస్ కు ఎందుకు దూరమయ్యిందో కాంగ్రెస్ కు తెలుసు. అయినా ఏమీ చేయలేదు. ఇరవై, ముప్పయ్ ఏళ్లు రాష్ట్రాల్లో తిరుగులేని బలమయిన నాయకులుగా, పార్టీకి స్తంభాలుగా ఉండాల్సిన వారు సొంత పార్టీలు పెట్టుకుని అధికారంలోకి రావడానికి కాంగ్రెస్సే కారణమని కాంగ్రెస్‌కు తెలియక కాదు. తెలిసినా ఏమీ చేయలేదు. కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగతంగా దేశం పట్టనంత సంపన్నులే కాంగ్రెస్ పార్టీ దేశం పట్టుకుని వీధి వీధి తిరగాల్సిన నిరుపేద ఎందుకయ్యిందో కాంగ్రెస్‌కు తెలుసు. అయినా ఏమీ చేయలేదు.



## కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు!

Courtesy: Namaste Telangana

### గుజరాత్‌లో రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు

- పార్టీలో ఉంటూ బీజేపీకి పని చేస్తున్నారంటూ ఆగ్రహం
- అలాంటి వారు బయటకు వెళ్లి పనిచేయాలంటూ అసహనం
- ఇటీవలే మోదీతో తనకు మంచి సంబంధాలున్నాయన్న రేవంత్
- అగ్రనేత రాహుల్‌గాంధీ హెచ్చరికలతో రాష్ట్ర కాంగ్రెస్‌లో కలకలం
- రాహుల్ వ్యాఖ్యలు రేవంత్‌కు కూడా వర్తిస్తాయేమోనంటూ చర్చ

'ప్రధానమంత్రి మోదీతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. పాలసీల పరంగా మాత్రమే నేను ఆయనను వ్యతిరేకిస్తాను' అని శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓ ప్రశ్నకు జవాబుగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

'కాంగ్రెస్ పార్టీలో కొందరు బీజేపీ కోవర్టులున్నారు. వాళ్లంతా కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీ కోసం పనిచేస్తున్నారు. అలాంటి వాళ్లు బయటకు వెళ్లి పనిచేయాలి. వాళ్లు 10, 20, 30 ఇలా ఎంతమంది ఉన్నా సరే వాళ్లందర్నీ పార్టీ నుంచి పంపిచేస్తా'

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఒకే రోజు తేడాతో సీఎం రేవంత్‌రెడ్డి.. మోదీతో తనకు మంచి సంబంధాలున్నాయని చెప్పడం, మరోవైపు కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులున్నారని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. ఈ వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నది. రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు కేవలం గుజరాత్‌కే పరిమితమవుతాయా లేక తెలంగాణకు కూడా వర్తిస్తాయా అంటూ పార్టీ నేతలు ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా రాహుల్ వ్యాఖ్యల ఉద్దేశం వెనుక

దేశానికి కాంగ్రెస్ అవసరం ఉందని దేశ ప్రజలకు తెలుసు. కానీ కాంగ్రెస్‌కే దేశంతో అవసరం ఉన్నట్లు తెలియడం లేదు. అంతే!

**అన్నట్లు-**

"కోవర్ట్" అన్న ఇంగ్లిష్ మాటకు తెలుగు అనువాదమేమిటబ్బా? "ఇంటిదొంగ" కొంచెం దగ్గరి మాట అవుతుందేమో అని ఎవరో అన్నారు కానీ పాపం.. స్వభావరీత్యా దొంగలను అవమానించినట్లవుతుంది. మాట లేదనుకుని తెలుగులో కోవర్టులు లేరనుకునేరు పొరపాటున! కొంప కొల్లేరవుతుంది- జాగ్రత్త!

**-పమిడికాల్వ మధుసూదన్**

## యువత మత్తుతో చిత్తు కావద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడపు నాయుడు అన్నారు. నగరంలోని సోషల్ వెల్ఫేర్ శాఖ కళాశాల వసతిగృహంలో భారతీయ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడపు నాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో గంజాయి జడలు విప్పి యువత, విద్యార్థులను మత్తులో ముంచేస్తుందన్నారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా సంకల్పం కార్యక్రమం ద్వారా యువతకు, విద్యార్థులకు గంజాయి, సైబర్ క్రైం గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒకప్పుడు చోరీలు, దారి దోపిడీలు, మహిళలపై అఘాత్యాలు, తగాదాలు వంటి నేరాలు ఎక్కువగా ఉండేవని, ఇప్పుడు ప్రధాన నేరాలుగా డ్రగ్స్, సైబర్ క్రైంలు ఉన్నాయని స్పష్టం చేశారు. దేశ స్థితిగతులు మార్చ శక్తి యువతకి ఉందని, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటికి దూరంగా ఉండాలన్నారు. వివిధ రూపాల్లో గంజాయి స్మగ్లర్లు వాటిని మార్కెట్‌లో విక్రయిస్తున్నారని, డబ్బు ఆశ చూపి మైనర్లు, విద్యార్థులు, మహిళలను గంజాయి రవాణాకు వినియోగిస్తున్నారన్నారు. గంజాయి పండించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, మత్తు పదార్థాలు, సైబర్ క్రైం గురించి తల్లిదండ్రులు, చుట్టాలకు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. బీహెచ్ ఆర్‌సీ ఆంధ్ర - తెలంగాణా రీజనల్ హెడ్ కొంక్యాన వేణుగోపాల్, మంత్రి వెంకటస్వామి, తొత్తడి మణికంఠ, ప్రభుదేవా, మణిశర్మ, సౌజన్య, అంధవరపు జ్యోతిర్మయి, జెసీఐ దూసి సంతోష్, హాస్టల్ ఇన్‌చార్జ్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఏపిటిఎస్ఏ శ్రీకాకుళం జిల్లా

## నూతన కార్యవర్గం ఎన్నిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ ఎన్నిక (ఏపిటిఎస్ఏ) నిబంధనల మేరకు శ్రీకాకుళం ఖజానా కార్యాలయంలో నిర్వహించగా, నూతన కార్యవర్గం ఏర్పడిందని నూతన అధ్యక్షులుగా ఎన్నికైన డి.శ్రీరామ్ కుమార్, సెక్రటరీ యం.డేవిడ్‌లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని, విధి నిర్వహణలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రెసిడెంట్‌గా డి.శ్రీరామ్ కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.భాగ్యలక్ష్మి, సెక్రటరీ యం.డేవిడ్, ట్రేజరర్ కే.వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు ఐ.జ్యోతిలక్ష్మి, బి.ప్రదీప్ కుమార్, ఎం.సాయిప్రసాద్, వై.కోటీశ్వరావు, జాయింట్ సెక్రటరీలుగా కే.నారాయణరావు, పి.చంద్రశేఖర్, పి.రమణమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోనేలా నాగభూషణం ఎన్నికయ్యారన్నారు. అనంతరం డి.శ్రీరామ్ కుమార్, యం.డేవిడ్ ప్యానల్‌కు నమ్మకంతో గెలిపించిన ట్రెజరీ కుటుంబ సభ్యులందరికి ధన్యవాదములు తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు ప్రముఖులు, వక్తలు, ఏపిటిఎస్ఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలలో ఏపిటిఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం కిరణ్ కుమార్, రమణారెడ్డి, పాండురంగ భాస్కర్, బొత్స శ్రీనివాస్ రావు తదితర బృందం పాల్గొన్నారు.

## బీసీ స్టడీసర్కిల్‌లో డిఎస్సీ కోసం ఉచిత ఆన్లైన్ శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెగా డిఎస్సీ పరీక్షకు అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఉచిత ఆన్లైన్ శిక్షణ ఇవ్వనుందని సంచాలకులు ఇ.అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకులు విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ శిక్షణను ప్రారంభించనున్నామన్నారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన శ్రీకాకుళం జిల్లాలోని బీసీ, ఈబీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు ఈ ఉచిత ఆన్లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అభ్యర్థుల ఎంపిక టెట్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక 80 అడుగుల రోడ్డులో టీడీపీ భవనం వెనుక గల ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించవచ్చు.

అంగన్వాడీ వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజయవాడ వెళ్తున్న తమపై ప్రభుత్వం నిర్బంధం చేపట్టి విజయవాడ రానీయకుండా హౌస్ అరెస్టు, బస్సులు నుండి దింపేయడం అన్యాయమంటూ టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్లు సోమవారం ధర్నా చేశారు. గతంలో కూడా ప్రభుత్వం తమపై నిర్బంధం చేపట్టిందన్నారు. ఇప్పటికైనా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

– సత్యంన్యూస్, టెక్కలి





స్థానిక మహాత్మ జ్యోతిభాపూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి జి.స్వరాజ్యలక్ష్మి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# కోర్టును బురిడీ కొట్టించడమే 'గీతా'సారం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తంగా దళితులు, బీసీలకు 1976లో పంపిణీ చేసింది. అందులో భాగంగా పెద్దపాడు పంచాయతీ తంగివానిపేట దళిత కుటుంబానికి చెందిన లోపింటి రామయ్యకు సర్వే నెంబర్ 68/2డీలో 27 సెంట్ల భూమిని డి-పట్టా రూపంలో అందజేశారు. ఈ భూమి 2018 వరకు లోపింటి రామయ్య స్వాధీన అనుభవం లోనే ఉంది. గత ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో అడంగల్‌లో ఎల్పీ నెంబర్ 294గా మార్చారు. భూమి వర్గీకరణ, స్వభావం చూస్తే ప్రభుత్వ, సెటిల్మెంట్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో చూపిస్తుంది. ఈ భూమి 22-ఏ(1డీ)గా 2017 సెప్టెంబర్ 19న నోటిఫై చేసినట్టు చూపిస్తుంది. రీసర్వే తర్వాత కూడా ఈ భూమి 22ఏగా ప్రభుత్వ రికార్డుల్లో చూపిస్తుంది. దీనికి హక్కుదారుగా లోపింటి రామయ్య పేరు రికార్డుల్లో నమోదై ఉంది.

కానీ ఈ భూమి చుట్టూ గీతా శ్రీకాంత్ ప్రహరీ కడితే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. పోనీ లోపింటి రామయ్య నుంచి గీతా శ్రీకాంత్ కొనుగోలు చేసుకున్నారని భావించినా ఒక డి-పట్టా భూమి, అది కూడా 22ఎలో ఉన్న భూమికి ఆమె హక్కుదారు ఎలా అయ్యారో రెవెన్యూ యంత్రాంగం చెప్పడంలేదు. రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్నా, దాన్ని సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేసినట్టు గీతా శ్రీకాంత్ చెప్పుకొని తిరుగుతున్నారు. ఈ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి ప్రహరీ కట్టారని బాధితులు గత 15 రోజులుగా ఆ స్థలం వద్ద వంటావార్పు చేస్తూ బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. ఆక్రమించి సొంతం చేసుకోవడానికి చేసిన ప్రయత్నంలో ఒక న్యాయవాది, ప్రజాసంఘాల నాయకుడు, పెద్దపాడు వీఆర్వో ఈమెకు పూర్తిస్థాయిలో సహకరించారని లోపింటి రామయ్య వారసులు లోపింటి అప్పమ్మ, సవలాపురపు అప్పన్న, ఎచ్చెర్ల తవిటమ్మ, పుట్టా ఇందుమతి చెబుతున్నారు.

### ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ

1976లో డి-పట్టా రూపంలో సంక్రమించిన 27 సెంట్ల భూమి రామయ్య అనుభవ స్వాధీనంలో ఉంటుండగా ఆయన మృతి చెందాడు. రామయ్యతో పాటు మరికొందరు దళితులు, బీసీలకు ల్యాండ్ సీలింగ్ భూమిని డి-పట్టా రూపంలో పంపిణీ చేశారు. రామయ్య అనుభవంలో ఉన్న సర్వే నంబర్ 68/2డీని ఆయన మరణాంతరం పెద్దపాడు వీఆర్వో అప్పారావు సహకారంతో గీతా శ్రీకాంత్ సొంతం చేసుకోవడానికి ప్రయత్నాలు చేయడంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన వారసులు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులను పోలీసులు పిలిపించి మందలించి పంపించేశారు. దీంతో గీతా శ్రీకాంత్ రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఆ భూమిని ఆక్రమించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ సమయంలో కొందరు ప్రజాసంఘాల నాయకులు డి-పట్టా భూమిని ఆక్రమించుకుంటున్నారని ఆందోళన చేశారు కూడా. ఆ తర్వాత డి-పట్టా పత్రాలు కలిగిన లోపింటి రామయ్య వారసులు 2018లో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఇంజక్షన్ దావా వేశారు. సేల్ డీడ్ ద్వారా పెద్దపాడు సర్వే నెంబర్ 68/2సీ, 68/2డీలో 54 సెంట్లు కొనుగోలు చేసినట్టు రామయ్య వారసులకు వ్యతిరేకంగా గీతా శ్రీకాంత్ రెండు దావాలు వేశారని బాధితులు వెల్లడించారు. దావాలపై విచారణ సాగుతుండగా రామయ్య వారసుల కేసు వాదిస్తున్న న్యాయవాది ఉషా మృతి చెందగా, మరో న్యాయవాది ఈ కేసును వకాల్తా తీసుకున్నారు. ఈ దావాపై న్యాయస్థానంలో విచారణ సాగుతుండగా కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పి రామయ్య వారసులను న్యాయవాది ఇంటికి పిలిపించి వారితో సంతకాలు చేయించారు. ఆ తర్వాత 2022 నవంబర్ 12న లోక్ అదాలత్‌లో రాజీ చేయించి అవార్డు పాస్ చేయించారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదిర్చినట్లు, నాట్ ప్రెస్ మెమోలో రామయ్య వారసులకు ఎటువంటి హక్కు లేదని, భవిష్యత్తులో ఎలాంటి వివాదానికి అవకాశం ఉండదని, ఎవరి ఖర్చులు వారే భరించుకున్నట్టు రాయించారు.

### కోర్టునే తప్పుదోవ పట్టించారు

లోక్ అదాలత్‌లో రాజీ అయిన విషయం తెలియని రామయ్య వారసులు కేసు వకాల్తా తీసుకున్న న్యాయవాదిని కలిసిన ప్రతిసారీ విచారణ జరుగుతుందని చెప్పి పంపిస్తుండేవారని బాధితులు చెబుతున్నారు. దీంతో వేరొకరితో కేసు ఓఎస్ నెంబర్ ఇచ్చి ఆరాతీయగా లోక్ అదాలత్‌లో రాజీ చేసినట్టు న్యాయస్థానం రికార్డులో చూపించడంతో బాధితులు న్యాయవాదిని ప్రశ్నించారు. చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇచ్చి సదరు లాయరు తప్పుకున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. న్యాయవాదిని నమ్మి మోసపోయామని గుర్తించి వేరే న్యాయవాదిని సంప్రదించి న్యాయస్థానంలో కేసు పూర్వపరాలను పరిశీలించగా వకాల్తా తీసుకున్న న్యాయవాది కౌంటర్ దాఖలు చేయాలని సంతకాలు చేయించి లోక్ అదాలత్ నాట్‌ప్రెస్ మెమోలో మాత్రం నిసాని పెట్టించారని తేలింది. అప్పటి వరకు జరిగిన దావాలన్నింటిలోనూ లోపింటి రామయ్య వారసురాలు అప్పమ్మ సంతకాలు చేయగా, లోక్ అదాలత్‌లో మాత్రం అప్పమ్మ నిసాని పెట్టినట్టు చూపించారు. అంటే లోక్ అదాలత్‌కు లోపింటి రామయ్య వారసులకు బదులు వేరొకరిని తీసుకువెళ్లారన్నమాట. ఇది పూర్తిగా కోర్టును తప్పుదోవ పట్టించడమే. డి-పట్టా భూమిని ఆక్రమించుకుంటున్నారని మొదట్లో ఆందోళన చేసిన ప్రజాసంఘాల నాయకులను గీతా శ్రీకాంత్ కొనేసిన తర్వాతనే బాధితులకు తెలియకుండా లోక్ అదాలత్‌లో రాజీ చేసినట్టు రామయ్య వారసులు ఆరోపిస్తున్నారు.

### బైఠాయించి బాధితులు నిరసన

లోపింటి వారసులుగా ప్రజాసంఘాల నాయకుడు సూచించిన వ్యక్తులను లోక్ అదాలత్‌లో చూపించి పని కానిచ్చేశారని రామయ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దౌర్జన్యంగా ఆక్రమించి ప్రహరీ నిర్మించిన చోట భూమిపై సర్వహక్కులు కలిగిన రామయ్య వారసులు బైఠాయించి నిరసన తెలిపితే, పెద్దమనుషులకు డబ్బులిచ్చేశామని, ఇంకా ఎందుకు గొడవ చేస్తున్నారని బెదిరిస్తున్నట్టు బాధితులు చెబుతున్నారు. పెద్దమనుషులుగా వ్యవహరించిన వీఆర్వో అప్పారావు రూ.27 లక్షలు తీసుకున్నట్టు ఆరోపిస్తున్నారు. ఆయనతో పాటు న్యాయవాది, ప్రజాసంఘాల నాయకుడికి కలిపి రూ.50 లక్షలు ముట్టజెప్పారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితులు మరోమారు న్యాయపోరాటానికి సిద్ధమయ్యారని తెలిసింది. న్యాయస్థానంలో బాధితులకు జరిగిన అన్యాయాన్ని, మోసాన్ని వివరిస్తూ డి-పట్టా భూమిపై రామయ్య వారసులు డిక్లరేషన్ దావా వేశారు. దీంతో పాటు లోక్ అదాలత్‌కు, హైకోర్టు సీజేకు, రిజిస్ట్రార్‌కు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు పెద్దపాడు సర్వే నెంబర్ 68/2సీ, 68/2డీలో 54 సెంట్లు కొనుగోలు చేసినట్టు చెబుతున్నా లోపింటి రామయ్యకు ల్యాండ్ సీలింగ్ భూమికి ఇచ్చిన 27 సెంట్లు డి-పట్టా భూమి మేరకే ప్రహరీ కట్టారు. మిగతా 27 సెంట్లు ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. రామయ్యకు చెందిన 27 సెంట్లలో రెండు సెంట్లు జాతీయ రహదారి విస్తరణలో పోయింది. ప్రస్తుతం 25 సెంట్లు భూమి మాత్రమే మిగిలింది. దీన్ని ఆక్రమించి కొనుగోలుగా చూపించి గీతాశ్రీకాంత్ రాజకీయ నాయకులు సహకారంతో ప్రహరీ కట్టించినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.

## గద్దెను కలిసిన సివిల్ సప్లై యూనియన్ నాయకులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం తరపున ఉత్తరాంధ్ర నుంచి గద్దె బాబూరావు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ బోర్డ్ డైరెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా ఆయనను ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు, ఎంప్లాయిస్ మర్యాదపూర్వకంగా కలిశారు. 2015 వరకు తమ జీవితాలు అంతంత మాత్రమే ఉండేవని, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తమ కష్టానికి తగ్గట్టుగా జీతాలను పెంచారని, తర్వాత గత ప్రభుత్వ కాలంలో తమ పట్ల నాయకులు సానుకూలంగా స్పందించకపోవడంతో తాము నష్టపోయామని బాబూరావు దృష్టికి తెచ్చారు. పనికి తగ్గ ప్రతిఫలం రావట్లేదని తమ బాధను డైరెక్టర్ ముందు వ్యక్తం చేశారు. దీనిపై గద్దె బాబూరావు సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని చైర్మన్, ఎండి, పౌర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ల దృష్టికి తీసుకువెళ్తానని, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు పరిమితి పెంచండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతుసేవా కేంద్రానికి ధాన్యం కొనుగోలు పరిమితి అదనంగా 4వేల క్వింటాళ్లు పెంచాలని సంతవురిటి గ్రామానికి చెందిన వైకాపా జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి జాయింట్ కలెక్టర్‌ని కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో జేసీకి వినతిపత్రం అందించారు. సంతవురిటి రెవెన్యూ విలేజ్‌కి సంబంధించి విజయరాంపురం, ధవలపేట, సంతవురిటి గ్రామాలకు సంబంధించి రైతులు ధాన్యం కొనుగోలు పరిమితి అయిపోయిన కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుసేవా కేంద్రం కొనుగోలు పరిమితి పెంచాలని ఆయన జేసీని కోరారు.

## నాయుడుచెరువు ఆక్రమణలు తొలగించండి

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండల కేంద్రంలోని నాయుడు చెరువులో ఆక్రమణలు గుర్తించి తొలగించాలని సుంకర కోటి టెక్కలి ఆర్డీవోను కోరారు. ఈమేరకు వినతి పత్రం అందిస్తూ రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని, ఆక్రమణపై చర్యలు తీసుకోవాలిలని కోరారు. తక్షణం స్పందించకపోతే చెరువు పూర్తిగా ఆక్రమణకు గురై రైతులు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆర్డీవోకు తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.



## దక్షిణ భారతానికి పెనుద్రోహం... డీలిమిటేషన్



(మొదటిపేజీ తరువాయి)

డీలిమిటేషన్ ప్రక్రియను దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకించడంతో అప్పటి ప్రధాని వాజ్‌పాయి 1971లో చేసిన 543 పార్లమెంట్ సీట్లనే కొనసాగిస్తూ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ గడువు మరో 25 ఏళ్లకు పొడిగించారు.

### యాభయ్యేళ్ల వాయిదాకు ఒకే కారణం..

ఈ డీలిమిటేషన్ పద్ధతిని ఇందిరాగాంధీ 25 ఏళ్లు వాయిదా వేయడానికీ, వాజ్‌పాయి మరో 25 ఏళ్లు వాయిదా వేయడానికీ కారణం ఒక్కటే.. ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో ఫెయిలయ్యాయి కాబట్టి, జనాభా ప్రాతిపధికన విభజన జరిగితే సౌత్ స్టేట్స్ తీవ్రంగా నష్టపోతాయి కాబట్టి, జనాభాని నియంత్రించేందుకు ఉత్తరాది రాష్ట్రాలకు మరికొంత సమయం ఇస్తే అవి కూడా టార్గెట్ రీచ్ అయిన తర్వాత డీలిమిటేషన్ చేయడం అనేది న్యాయమైన పద్ధతి అని భావించడమే ఈ 50 ఏళ్ల సుదీర్ఘ వాయిదాకు ఏకైక కారణం.

రెండు అవకాశాలతో 50 ఏళ్ల గడువు ఇచ్చినప్పటికీ పరిస్థితిలో ఏ మార్పూ లేనప్పుడు ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ జరగకపోగా మరింత పెరిగినప్పుడు మళ్లీ ఏ ప్రాతిపదికన బీజేపీ ఇప్పుడు డీలిమిటేషన్ చేయాలనుకుంటుంది? ఇందిరాగాంధీ, వాజ్‌పేయి అప్పుడు ఎందుకు డీలిమిటేషన్ చేయలేదు? ఆ పరిస్థితుల్లో చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందన్న ఒకే ఒక్క కారణంతోనే కదా, మరి ఇప్పటికీ అదే పరిస్థితి ఉన్నప్పుడు ఆ కారణం చెక్కుచెదరకుండా అలానే ఉన్నప్పుడు ఇప్పుడు బీజేపీ డీలిమిటేషన్ ఎలా చేస్తుంది? ఈ రాష్ట్రాలు అన్యాయమైపోయినా పర్వాలేదు, బీజేపీ ప్రాబల్యం ఉన్న ఉత్తరాది సీట్ల పెంపు తద్వారా తమ రాజకీయ లబ్ధి అదే దానికి ముఖ్యం అన్న విషయం ఇక్కడ క్లియర్‌గా అర్థమవుతోంది కదా. ఈ డీలిమిటేషన్ చర్యని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిఘటించి బీజేపీని దక్షిణాది నుంచి తరిమికొట్టాల్సిన అవసరం ప్రతిఒక్క దక్షిణభారత పౌరుడికీ ఉంది.

### ఫెడరల్ వ్యవస్థ ధ్వంసం..

భారతదేశ అస్థిత్వమైన ఫెడరల్ వ్యవస్థను బీజేపీ క్రమంగా ధ్వంసం చేస్తూ ఏకకేంద్ర పాలనని తీసుకొచ్చే కుట్రకు మోదీ ప్రభుత్వం ఏనాడో తెరతీసింది. లోకల్ టాక్స్ విధానం తీసేసి జీఎస్‌టి పెట్టి సౌత్ ఇండియా సంపదంతా కొల్లగొడుతున్నా మనం చూస్తూ కూర్చున్నాం. కేంద్రానికి చెల్లించే ప్రతీ వంద రూపాయలకు దక్షిణాది రాష్ట్రాలకు తిరిగివచ్చేది 20, 30 రూపాయలు మాత్రమే. తమిళనాడు రాష్ట్రం వంద రూపాయలు చెల్లిస్తే దానికి వచ్చేది రూ.30. అదే బీహార్ విషయానికొస్తే 100కు దానికొచ్చేది 922 రూపాయలు. ఇంత వ్యత్యాసమా.. ఏంటీ అన్యాయం? అత్యధిక పన్నుల వసూలు దక్షిణాది రాష్ట్రాల నుంచే, ఈ కేటాయింపులు మోదీ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ఆధారంతో చేస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలు అడ్డూ ఆపూ లేకుండా జనాభాని పెంచుకుంటూపోతే, ఆ భారం దక్షిణ భారతీయులు మోస్తున్నారు. బీజేపీ మోయిస్తోంది. ఈ అన్యాయం చాలదన్నట్టు ఇప్పుడు ఈ డీలిమిటేషన్ బాంబు వేసేందుకు సిద్ధంగా ఉంది.

డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది 5 రాష్ట్రాల్లో కలిపి ప్రస్తుతం ఉన్న 129 సీట్లలో సుమారు 26 సీట్లు తగ్గుతాయి. 'స్టాలిన్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారు తమిళనాడు ఒక్క సీటు కూడా కోల్పోదు' అని. అమిత్‌షా చేసిన ప్రకటన ఎంత బూటకమంటే, ఇప్పుడున్న పార్లమెంట్ భవనం కెపాసిటీ 888. 1971 ప్రకారం ప్రతీ 10 లక్షల మందికి ఒక ఎంపీ చొప్పున విభజిస్తే 1400 పైగా సీట్లు పెంచాల్సింటుంది. అది కుదరని పని కాబట్టి 20 లక్షలకు ఒక ఎంపీ అనుకున్నా సంఖ్య 700. 17, 18 లక్షలకు ఒక ఎంపీ చొప్పున 850 పైగా పెంచితే దక్షిణాది రాష్ట్రాల సీట్లలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. పైగా ఒకటో రెండో సీట్లు పెరగొచ్చుకానీ ఉత్తరాదిన భారీగా వందల్లో పెరుగుతాయి. అంటే అది తగ్గడం కాదా అప్పుడు సౌత్ ప్రాతినిధ్యం ఘోరంగా తగ్గిపోదా.

### స్టాలిన్ వాదనకు గట్టి మద్దతు..

రాష్ట్రాల అధికారాలు తగ్గించి తమపై ఢిల్లీ ఇష్టానుసారం పెత్తనం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్టాలిన్ చేస్తున్న తిరుగుబాటుకు మద్దతుగా తమిళనాడు పార్టీలన్నీ ఏకతాటిపైకొచ్చాయి. ఇదే బాటలో కర్నాటక, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఏకమై డీలిమిటేషన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కూడా దీన్ని నిరసిస్తూ సీట్ల పెంపు జనాభా ఆధారంగా జరిగితే దక్షిణ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి కాబట్టి డీలిమిటేషన్ దామాషా పద్ధతిలో జరగాలని రేవంత్ రెడ్డి సూచించారు. దామాషా పద్ధతిలో జరినా కూడా ఉత్తరాది రాష్ట్రాలు ఎంతోకొంత లాభపడతాయి. కానీ దేశ రాజకీయాల్ని శాసించే పట్టు సౌత్ మీద పెత్తనం లక్షంగా పెట్టుకున్న బీజేపీ ఈ పద్ధతి ఒప్పుకునే ప్రసక్తే ఉండదు. ఇంత జరుగుతున్నా, దక్షిణాది రాష్ట్రాలు కోపంతో రగిలిపోతున్నా కూటమిగా బీజేపితో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ముఖ్యమంతి చంద్రబాబునాయుడు కానీ, పవన్ కళ్యాణ్ కానీ కనీసం ఖండించే ధైర్యం కూడా చేయలేకపోతున్నారు. వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఈ అన్యాయాన్ని వ్యతిరేకించడంలేదు. రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్‌కి రెండు తెలుగు రాష్ట్రాలకూ అసెంబ్లీ, పార్లమెంటు సీట్ల సంఖ్య పెంచాల్సి ఉంది. అవి పెంచకపోగా డీలిమిటేషన్‌తో మరింత తగ్గిస్తుంటే అడిగే నాధుడే లేడు.

### బలవంతంగా హిందీ..

భారత రాజ్యాంగం ఫెడరల్ వ్యవస్థను ఆధారం చేసుకుని ఉందన్న విషయాన్ని బీజేపీ మర్చిపోతోంది. అందుకే తమ భాషని కూడా ప్రజల మీద బలవంతంగా రుద్దుతూ, దాన్ని అంగీకరించని వాళ్లకు హక్కుగా రావాల్సిన నిధులు నిలిపివేస్తామనేంత అహంకారాన్ని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. మీ పెత్తనాన్ని ప్రజలు ఎల్లకాలం సహిస్తారనుకుంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. మన ఉనికి, ఆత్మగౌరవం కాపాడుకోవాలంటే తమిళనాడు హిందీని తిరస్కరించినట్టు దక్షిణాది రాష్ట్రాలన్నీ కూడా హిందీని తిరస్కరించాలి. నేర్చుకోవాలనుకునేవారు నేర్చుకుంటారు బలవంతంగా రుద్దడాన్ని 3 లాంగ్వేజ్ పాలసీని కచ్చితంగా వ్యతిరేకించాలి. దీనివల్ల విద్యార్థులపై మూడో భాష అనే భారం తగ్గుతుంది. తమిళనాడు ప్రజలు వద్దు మొర్రో అంటున్నా హిందీ భాషని బలవంతంగా ఎందుకు రుద్దుతున్నారు. ఈ దేశంలో ప్రాంతీయ పార్టీలను నాశనం చేస్తూ బీజేపీ ఎదుగుతున్నట్టే ప్రాంతీయ భాషల్ని నాశనం చేస్తూ హిందీని ఆకాశానికెత్తుతున్నారు. బీహార్‌లో హిందీని అధికార భాషగా ప్రకటించినప్పుడు ఆ రాష్ట్రంలో 90 శాతం మందికి అసలు హిందీ భాష రాదు. ఇప్పుడు హిందీ బెల్ట్ అని చెప్పుకునే రాష్ట్రాల్లో ఒకప్పటి స్థానిక భాషలన్నింటినీ చంపి అది బతుకుతోంది. హిందీ భాషకు సొంత లిపి కూడా లేదు. మరాఠీ, సంస్కృతం లాంటి వందలాది భాషలు ఉపయోగించే దేవనాగరి లిపిలోనే హిందీ రాస్తారు తప్ప దీనికంటూ ప్రత్యేక స్క్రిప్ట్ లేదు.

### అతి ప్రాచీన తమిళ సాహిత్యం..

హిందీ భాష భారతదేశంలోకి రాకముందే ఈ దేశంలో తమిళ సాహిత్యం వుంది. దైవ భాష అని చెప్పుకునే సంస్కృతం పుట్టడానికి వేయి సంవత్సరాల ముందే తమిళ భాష ప్రాచుర్యంలో వుంది. మీ హిందీ మీకు గొప్పదయినట్టే ఎవరి మాతృభాష వాళ్లకు గొప్పదే. హిందీ పెత్తనాన్ని మొదటి నుంచీ వ్యతిరేకించలేని తెలుగు, కన్నడ రాష్ట్రాలు భాషాపరంగా చాలానే నష్టపోయాయి భాషలో మార్పులు. అచ్చ తెలుగు పదాలు మాయమై 50 శాతం పైగా సంస్కృత పదాలు మన భాషలో వచ్చి కూర్చున్నాయి. కానీ తమిళ భాషలో ఇప్పటికీ స్వచ్ఛమైన తమిళ ప్రాచీన పదాలు సజీవంగా ఉన్నాయి. పరభాషా వాసన తమిళానికి అంటకుండా హిందీతో వందేళ్లుగా పోరాటం చేస్తూ వాళ్ల భాషను కాపాడుకుంటూ వస్తున్న తమిళ ప్రజల్ని కచ్చితంగా అభినందించాల్సిందే. మాతృ భాషను అభిమానిచడం మనం వారి నుంచి నేర్చుకోవాలి. ఇప్పుడు మళ్లీ వాళ్ల భాష మీద దాడి చేస్తే ఆ పెత్తనాన్ని వ్యతిరేకించకుండా ఎలా ఉంటారు! ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం పెడితే తెలుగు చచ్చిపోతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇప్పుడు హిందీకి మద్ధతిస్తున్నారు. భిన్నమైన సంస్కృతి సంప్రదా యాలు, భిన్నమైన భాషలు, జీవన విధానాలున్న ఈ దేశం ఒకటిగా ఉండడానికి ఫెడరల్ సిస్టమ్ ఒక్కటే కారణం.

### నాటి సైమన్ కమిషన్ అధ్యయనం, బొమ్మై కేసు..

బ్రిటీష్‌వాళ్లు వాళ్ల దేశంలో యునిటరీ ప్రభుత్వాన్ని (అధికారం మొత్తం కేంద్రం చేతిలోనే ఉంటుంది) నడుపుతున్నప్పటికీ భారతదేశానికి ఆ విధానం ఎంతమాత్రం సూట్ కాదనే విషయాన్ని 1934లో నియమించిన సైమన్ కమిషన్ అధ్యయనం ద్వారా రుజువు చేసారు. ఇంత భిన్నత్వంతో ఉన్న దేశంలో అధికారం ఏకకేంద్రంగా ఉంటే దేశ ఉనికికే ప్రమాదమని ప్రతీ ప్రాంతానికీ (రాష్ట్రానికీ) సమాన ప్రాధాన్యత అధికారం, హక్కులు ఉంటేనే పాలన సాధ్యమవుతుందని, కాబట్టి ఇండియా ఫెడరల్ కంట్రీగానే ఉండాలని బ్రిటీష్ గవర్నమెంట్ స్పష్టం చేసింది. కానీ దాన్ని అప్పటి కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. అధికారాలన్నీ కేంద్రం చేతిలోనే ఉండాలని దాని ఆధీనంలోనే రాష్ట్రాలు పని చేయాలనేది కాంగ్రెస్ ఉద్దేశం. కానీ ఫెడరల్ వ్యవస్థని ఇంతగా వ్యతిరేకించిన కాంగ్రెస్‌కు స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగంలో రాష్ట్రాలకు ప్రత్యేక గుర్తింపులు, అధికారాలు, బాధ్యతలు ఇస్తూ సమాఖ్య భావాలు పొందుపరచక తప్పలేదు. కానీ అప్పటి ఉత్తరాది నాయకులు చాలా తెలివిగా, కుట్రపూరితంగా రాజ్యాంగంలో ఎక్కడా ఫెడరల్ అనే మాట మచ్చుకైనా కనిపించకుండా చాలా జాగ్రత్త పడ్డారు. కానీ 1994 ఎస్.ఆర్. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు చాలా క్లియర్‌గా చెప్పింది భారతదేశం కచ్చితంగా సమాఖ్య దేశం, ఫెడరల్ కంట్రీ అని. అమెరికా లాంటి ఫెడరల్ వ్యవస్థలో కేంద్రం వ్యవహరించే తీరు ఏ రాష్ట్రానికైనా నచ్చకపోతే ఆ రాష్ట్రం విడిపోయి స్వతంత్ర దేశంగా ప్రకటించుకునే స్వేచ్ఛ ఉంటుంది. కానీ మన దేశంలో రాష్ట్రాలకు ఆ హక్కు లేకుండా యునిటరీ పద్ధతిలో కేంద్రానికి అదనపు అధికారాలిచ్చారు. కేంద్రానికీ, రాష్ట్రాలకు మధ్య గొడవ వస్తే స్వతంత్రంగా పనిచేసే న్యాయవ్యవస్థ జోక్యం కల్పించుకుని సమస్య పరిష్కరించాలని రాజ్యాంగంలో రాశారు కానీ ప్రస్తుతం ఈ దేశంలో న్యాయవ్యవస్థ నిజంగా స్వతంత్రగా పని చేస్తుందా అనేది పెద్ద ప్రశ్న.

### ఎన్నో రాష్ట్రాల వ్యతిరేకత..

దక్షిణ రాష్ట్రాలే కాదు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు కూడా డీలిమిటేషన్ని వ్యతిరేకిస్తున్నాయి. వారికి కూడా నష్టం జరుగుతుంది. అయినా బీజేపీ తన మొండివైఖరి విడనాడకపోతే రాబోయే రోజుల్లో పరిస్థితులు తీవ్రంగా పరిణమించే వాతావరణం కనిపిస్తోంది. కేంద్రం రాష్ట్రాల మధ్య ఎలాంటి చిచ్చు రగిలినా తమ అధికారానికి డోకా లేదని బీజేపీ భావిస్తే దానికి మూల్యం చెల్లించాల్సింది మాత్రం ఈ దేశమే అవుతుంది.

### ఫెయిలయితే బహుమతులు?

ఒక పరీక్ష పెట్టిన నిర్వాహకులే (కేంద్రం) అందులో నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా వ్యవహరించి పరీక్ష ఫెయిల్ అయిన వాళ్లకు బహుమతులు ఇస్తూ, క్రమశిక్షణతో కష్టపడి పరీక్ష పాసైన వారిని శిక్షిస్తే లక్ష్యాన్ని చేరుకున్న ప్రజలు కచ్చితంగా ఎదురుతిరుగుతారు? న్యాయాన్ని పొందలేని తిరుగుబాట్లు విధ్వంసానికి దారితీసిన సంఘటనలు చరిత్రలో ఎన్నో. స్టాలిన్ మాటలు చూస్తే ఆ విధ్వంసం వైపు అప్పుడే అడుగులు కూడా పడుతున్నాయనిపిస్తుంది. డీలిమిటేషన్లో మనకు కూడా న్యాయం జరగాలంటే ఒక్కొక్కరూ 16 మంది పిల్లల్ని కనాలి అని స్టాలిన్ అన్నప్పుడు అదేదో వెటకారంగా అన్న మాటలుగా అనిపించినా ఆయన చాలా సభల్లో మన కష్టం మన సంపద మనకే ఉండాలంటే జనాభాని పెంచాలని పదే పదే చెప్పడం చూస్తుంటే మనం ఎటు వెళుతున్నాం. మరోపక్క చంద్రబాబు జనాభాని పెంచమంటున్నారు. ఇప్పటికే చైనాను మించిపోయి మొదటిస్థానాన్ని ఆక్రమించుకుంటున్నాం ఇంకా ఎక్కడికి పోవాలి? దీనికి పరిష్కారం ఏంటి? వినాశనం తప్పదనుకున్నప్పుడు ఎవడో ఉత్తరాదివాడొచ్చి మనని నాశనం చేయడం ఏంటి? జనాభా పెంపుతో మనల్ని మనమే నాశనం చేసుకుందాం అనే ధోరణి వస్తే ఈ దేశంలోని ప్రతి రాష్ట్రం బీహార్ అవుతుంది. ఆ రాష్ట్రాల్ని పోషించడానికి అప్పుడూ దక్షిణాది రాష్ట్రాలుండవు. ఫెయిల్ అయినవారు పాసయ్యేలా చిత్తశుద్ధితో కార్యక్రమాలు చేపట్టకుండా పాస్ అయిన వారిని శిక్షించి ఫెయిల్ అవ్వడమే మంచిదనే భావన కలిగించే బీజేపీ స్వార్థ పాలకులు భారతదేశ చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.